లక్షల వ్యయం నెరవేరని లక్ష్యం

- ప్రారంభానికి ముందే పాడైన పాత పైపులైను, కుళాయిలు
- జల జీవన్ మిషన్ నిధులతో కొత్త పైపు లైను
- ఇంటింటి కుళాయి కనెక్షన్లకు వేసిన పైపులు
- ఎనిమిది నెలలైనా ఇవ్వని కనెక్షన్లు



బొత్సపేటలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

ఇళ్ల వద్ద కనెక్షన్ ఇవ్వకుండా మురుగు కూపంలో వదిలేసిన గొట్టాలు

మూలకు చేరిన పాత కుళాయి

పద్మనాభం: లక్షల రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకాలు నిర్మించినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు. బీఆర్ తాళ్ల వలస పంచాయతీ బొత్సపేటవాసులకూ నేటికీ సురక్షిత తాగునీరు అందడం లేదు.

బొత్సపేట గ్రామంలో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. దీనికి సుమారు రూ.30 లక్షలు వెచ్చించారు. ఈ నిధులతో రూ.40వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద మోటారు ఏర్పాటు చేసి, దీనికి అనుసంధానంగా పైపులైను వేశారు. 15 కుళాయిలు ఏర్పాటు చేశారు. 2018లో ట్రయల్ రన్ వేయగా మోటారు కాలిపోవడంతో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేశారు. మళ్లీ ట్రయల్ రన్ వేయగా నీరు ట్యాంకులోకి పంపింగ్ అవ్వలేదు. గాలికి వదిలేయడంతో పైపు లైను పూర్తిగా పాడైపోయింది. కుళాయిలూ పోయాయి. దీంతో వాటర్ ట్యాంకు ఆరేళ్ల నుంచి నిరుపయోగంగా పడి ఉంది.

వైఎస్సార్‌సీపీ నిధులు మంజూరు చేసినా..

ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ కుళాయిల కనెక్షన్ ఇచ్చేందుకు జలజీవన్ మిషన్ నిధులు రూ.18 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో కొత్తగా పైపులైన్ వేశారు. 230 ఇళ్ల ముంగిటకు కనెక్షన్లు ఇవ్వడానికి గొట్టాలు వేశారు. గొట్టాలు వేసి సుమారు ఎనిమిది నెలలు అయింది. ఈ లోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ పైపులకు కనెక్షన్లు ఇవ్వలేదు. కొన్ని గొట్టాలు చెట్లకు, మరికొన్ని గొట్టాలు మురికి నీటిలో పడి ఉన్నాయి. కొత్తగా మోటారు వేయాల్సి ఉంది.

తాగునీటికి అవస్థలు

గ్రామంలో మూడు బోర్లే ఉన్నాయి. గ్రామంలో ఉన్న 12 వందల మందికి ఇవి చాలకపోడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల బోర్ల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. ఇంటింటి కుళాయిల ద్వారా నీరు ఎప్పుడు సరఫరా చేస్తారా అని ప్రజలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.



కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా కొబ్బరి చెట్టుకు కట్టి వదిలేసిన గొట్టం

చాలా ఇబ్బంది పడుతున్నాం



ఇంటింటికీ కుళాయిలు వేశారు, మంచినీరు వచ్చేస్తుందని ఎంతో ఆశపడ్డాం. కానీ పనులు ఆగిపోయాయి. గ్రామంలో ఉన్న మూడు బోర్లు గ్రామంలో అందరికీ సరిపోవడంలేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల వద్ద ఉన్న బోర్ల దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి కుళాయి కనెక్షన్లు ఇచ్చి, మా నీటి కష్టాలు తొలగించాలి.

– ఎం.లక్ష్మి, బొత్సపేట

కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి



కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదుచు చూస్తున్నారు. జలజీవన్ మిషన్ నిధులతో గొట్టాలు వేశారు. బోరు వేయాల్సి ఉంది. అందు వల్ల కనెక్షన్ ఇవ్వలేదు. ఆ గొట్టాలు ఎందుకూ కొరగాకుండా ఉన్నాయి. అధికారులు స్పందించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

– సి.హెచ్.పైడినాయుడు, ఎంపీటీసీ, బి.ఆర్.తాళ్లవలస

జనవరి నెలాఖరులోగా సరఫరాకు చర్యలు

జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మా శాఖ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. జనవరి నెలాఖరులోగా బొత్సపేటలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతాం. బోరు వేయాల్సి ఉంది. వేస్తాం.

– బి.హరీష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఘనంగా వీర బాల దివస్



కార్యక్రమంలో పాల్గొన్న మత పెద్దలు

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు కే1 కాలనీ గురజాడ నగర్‌లో వీర బాలదివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వీర బాలలు జొరావర్‌సింగ్, ఫతేసింగ్ చిత్రపటాలకు విశాఖ నగర గురుద్వార అధ్యక్షుడు ఆనంద్‌సింగ్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర బాలలను, సమరయోధులను స్మరించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. బాల్యం నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలని, దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు దివంగత రుషిత్ సింగ్ పేరున స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సుబ్బరాజు, కార్యక్రమం ప్రాంతీయ కో–ఆర్డినేటర్ ప్రకాష్ రెడ్డి, సమన్వయకర్తలు రూపాకుల రవికుమార్, రంగం దానేష్, అవతార్‌సింగ్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల టీటీ చాంపియన్ 'గీతం'

కొమ్మాది: ఇటీవల కాకినాడలో శ్రీప్రకాష్ సినర్జీ విద్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ (పురుషుల) పోటీల్లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో గీతం న్యాయ కళాశాల విద్యార్థి సూర్యతేజ ప్రథమ స్థానంలో నిలవగా పీజీ విద్యార్థులు రోహిత్ హల్దర్, కుశాల్‌దాస్, వరుస స్థానాల్లో నిలిచారు. అలాగే బీబీఏ విద్యార్థి ప్రజ్ఞాన్ అండర్–19 విభాగంలో కాంస్య పతకం సాధించారు.

క్లుప్తంగా

మొగదారమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో నాలుగో గురువారం మార్గశిర మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, అష్టలక్ష్మీ ఆరాధన, శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని పసుపు, కుంకుమలతో అర్చించారు.

60 మందికి కంటి పరీక్షలు



కంటి రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పద్మనాభం: సత్య సాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని బుడ్డివలసలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. శంకర ఫౌండేషన్ వైద్యురాలు ఎస్.అరుణ కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం జోన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో జోనల్ కో–ఆర్డినేటర్ ఎం.వి.సత్య సాయి కుమార్, జిల్లా సేవా గ్రామాల కో–ఆర్డినేటర్ ఎం.ఈశ్వరరావు, క్యాంప్ కో–ఆర్డినేటర్ వై.పైడిరాజు పాల్గొన్నారు.

దేవాలయ స్థలంలో సర్వే



సర్వే నిర్వహిస్తున్న జీవీఎంసీ సర్వేయర్ ప్రభాకర్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయానికి సంబంధించిన స్థలంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈ స్థలంలో కొంతమేర నిర్మాణ రంగానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించినట్లు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానిక గ్రామ పెద్దలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ సర్వేయర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఎంతమేర స్థలం ఆక్రమణకు గురైందనే వివరాలు సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు లోకేష్



లోకేష్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం: కీతిన్‌పేట సన్ స్కూల్ పదో తరగతి విద్యార్థి సుంకర లోకేష్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ద్వారా పాల్గొనగా జట్టు ద్వితీయ స్థానం పొందింది. ఈ పోటీల్లో లోకేష్ చక్కని ప్రతిభను కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి 31 వరకు చెన్నైలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా లోకేష్‌ను పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. జాతీయస్థాయిలోనూ రాణించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇటుకల వ్యాపారి ఆత్మహత్య

- కుమార్తెకు జరిగిన అన్యాయంపై మనస్తాపం
- న్యాయం చేయాలని ప్రజా ప్రతినిధులకు లేఖ



బొట్ట శ్రీనివాసరావు (ఫైల్)

తగరపువలస: నగరానికి చెందిన ఇటుకల వ్యాపారి బొట్ట శ్రీనివాసరావు మనస్తాపంతో బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన స్వస్థలమైన నెల్లూరు జిల్లా కలిగిరి ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివి..

శ్రీనివాసరావు బతుకుతెరువు రీత్యా 35 ఏళ్ల క్రితమే భీమిలి మండలం టి.నగరపాలెం వచ్చి, ఇక్కడ స్థిరపడి ఇటుకల వ్యాపారం చేస్తున్నారు. ఈయనకు భార్య వరలక్ష్మి, కుమార్తె యామిని, కుమారుడు కిషోర్ ఉన్నారు. కుమార్తెను భీమిలి జోన్ సంగివలసకు చెందిన సంపన్న కుటుంబంలో యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. తర్వాత ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలు రావడంతో యామిని ఏడాదిగా పుట్టింట్లో ఉంటోంది. అత్తింటి వారు యామిని కుమారుడిని కూడా ఆమె నుంచి లాక్కుని, వారి వద్ద ఉంచుకున్నారు. కుమార్తెకు జరిగిన అన్యాయంపై శ్రీనివాసరావు స్థానిక పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. భీమిలి పోలీసులతో పాటు మధురవాడ ఏసీపీని ఆశ్రయించారు. అయినప్పటికీ న్యాయం జరగడం లేదని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో తన స్వస్థలమైన కలిగిరికి ఇటీవల వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అక్కడి పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. కుమార్తె అత్తింటి తరఫు వారిపై కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని టి.నగరపాలెం తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు యామిని అత్తింటి వద్ద ఎలాంటి ఆందోళనలు చేయకుండా భీమిలి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

న్యాయం చేయాలని సూసైడ్ నోట్

ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు తమ కుటుంబానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మినిస్టర్, భీమిలి ఎమ్మెల్యే న్యాయం చేయాలని కోరుతూ సూసైడ్ నోట్ రాశారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి బైక్ ర్యాలీ

మధురవాడ: పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం విశాఖ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ నాయకులు గురువారం సాయంత్రం మధురవాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కొమ్మాది జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ మధురవాడ, చంద్రంపాలెం, కార్‌షెడ్ మీదుగా వివిధ ప్రాంతాలలో తిరిగి మళ్లీ కొమ్మాది జంక్షన్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ 28వ తేదీన ఉదయం 10గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి భారీ ప్రదర్శన అనంతరం సుజాతనగర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాములప్పడు, సీహెచ్ శేషుబాబు, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పకడ్బందీగా కులగణన సామాజిక సర్వే

భీమునిపట్నం: ఎస్సీ కులగణనపై సామాజిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు రామారావు, ఎంపీడీవో హనుమంతరావు సిబ్బందికి సూచించారు. సర్వే చేయవలసిన విధివిధానాలపై రెవెన్యూ అధికారులు, డిజిటల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో సిబ్బంది ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలను సేకరించి నమోదు చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం వివరాలను మరోసారి సరి చూసుకోవాలని తెలియజేశారు.

ఎల్‌పీఎం నంబర్లు మార్చాలని వినతి

పద్మనాభం: మండలంలోని కోరాడలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 27 దరఖాస్తులు వచ్చాయి. ఇద్దరు, ముగ్గురు రైతులకు ఉన్న ఒకే ఎల్‌పీఎం నంబర్‌ను మార్చాలని తహసీల్దార్ కె.ఆనందరావుకు గ్రామ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు దరఖాస్తు చేశారు. ఒక రైతు ఎల్‌పీఎం నంబర్ వేరే రైతులకు నమోదు కావడం వల్ల 1బీలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్‌కు విన్నవించారు. సదస్సులో మ్యుటేషన్ కోసం 18 మంది, సర్వే చేయాలని ఐదుగురు, కులం సర్టిఫికెట్ల కోసం నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. సదస్సును ప్రత్యేక అధికారి సుధాసాగర్ సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండ్రోతు శ్రీనివాసరావు, గెద్ద ప్రసాద్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కోరాడ సర్పంచ్ లక్ష్మణరావు

'విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనకు తరలి రండి'

తగరపువలస: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలి రావాలని ఆయా మండలాల నాయకులు, జీవీఎంసీ వార్డు నాయకులు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సూచనల మేరకు ఉదయం 10 గంటలకు తగరపువలస బైపాస్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పాదయాత్రగా వెళ్తామన్నారు. అనంతరం అక్కడి అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసి కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

తగరపువలస: ఆనందపురం మండలం బోయిపాలెం బస్‌స్టాప్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆనందపురం పోలీసులు బుధవారం గుర్తించారు. 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న ఈ వ్యక్తిని చికిత్స కోసం 108లో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన గురువారం మృతి చెందారు. కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో గురువారం పీఎం సూర్యఘర్ సోలార్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, డీపీవో శ్రీనివాసరావు, డీఈఈ రాజశేఖర్, ఏఇఇ సురేష్‌కుమార్, ఎంపీడీవో వి.జానకి, పంచాయతీ విస్తరణ అధికారి డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలు వద్దంటూ సంతకాల సేకరణ

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్ తవ్వకాలు వద్దంటూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 28న మరోమారు ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్న కారణంగా, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.నాగరాణి, షిణగం శ్రీనివాస్ తదితరులు కోరారు.

'పరీక్షా పే చర్చ' పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ: విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాలు పోగొట్టేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చ–2025' కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి కోరారు. కార్యక్రమ పోస్టర్‌ను పాఠశాలలో గురువారం సాయంత్రం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా రిజిస్టర్ అయ్యి పరీక్ష పే చర్చకు ప్రశ్నలను పంపించాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షలలో తాము అవలంబిస్తున్న విధానాలపై గాని, పరీక్షల సంస్కరణలపై గానీ, ఒత్తిడి నివారణపై గానీ తెలియజేయవచ్చన్నారు. విద్యార్థులు తమ ఇంటి వద్ద తల్లిదండ్రులతో వారి మొబైల్ ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేయించి, పేరెంట్స్ కూడా ప్రశ్నలు నమోదు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన పోస్టర్లను తరగతి గదులలో, నోటీసు బోర్డుల్లో అమర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, నాగేశ్వరరావు, కె.శ్రీను, విజయ్‌కుమార్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



చంద్రంపాలెం హైస్కూల్లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం రవి తదితరులు

ఘనంగా సీపీఐ శత వసంతాల వేడుకలు

తగరపువలస: సీపీఐ శత వసంతాల వేడుకలు గురువారం స్థానిక గుజ్జు రామునాయుడు భవన్ వద్ద జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని ఎగరవేసి, నాయకులు మాట్లాడారు. వందేళ్ల పాటు అరుణపతాకం ఎందరో కార్మికులు, కర్షకులకు అండగా నిలిచిందన్నారు. అనంతరం గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల పార్టీ పతాకాలను ఎగరవేశారు. ఈ వేడుకలలో నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, మావూరి సన్యాసమ్మ, మోర అప్పలరాజు, కానూరి రాంబాబు, నూలు ఆదినారాయణ, సన్నిబాబు, లక్ష్మణరావు, సత్యం, గోవింద్, చిల్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పతాకావిష్కరణ

మధురవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాన్ని మధురవాడలో పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకావిష్కరణ చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ 99 వసంతాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న క్రమంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 1925 డిసెంబర్ 26న దేశంలో అనేక ప్రాంతాలలో ఉన్న వారు కలసి కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించారన్నారు. ఎన్నో నిర్బంధాలు, పోరాటాలు, త్యాగాల నుంచి తమ పార్టీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.జగ్గస్వామి, త్రినాథ్, పి.రమణ, బంగారయ్య, అప్పలరాజు, సోములు తదితరులు పాల్గొన్నారు.



గుజ్జు రామునాయుడు భవన్ వద్ద మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

హిందీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ద్వారా పరిచయ్ పరీక్షకు హాజరుకానున్న 100 మంది విద్యార్థులకు భీమిలికి చెందిన స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.16వేల విలువైన పాఠ్యపుస్తకాలను గురువారం అందించారు. భీమిలిలోని మూడు పాఠశాలల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ, ఉపాధ్యాయులు సతీష్, నానాజీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో అడుగు పెట్టలేం



కూరగాయల మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి

తగరపువలస: గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక ప్రైవేట్ మార్కెట్ చిత్తడిగా మారింది. దీంతో చిరు వ్యాపారులు, వినియోగదారులు మార్కెట్‌లో అడుగు పెట్టలేకపోతున్నారు. గలీజుగా ఉన్న వాతావరణంలోనే ఒకరిద్దరు వ్యాపారులు చేపలు, కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయిస్తున్నా, వినియోగదారులు బురదలో అడుగు వేయలేక రావడం లేదు. తమ నుంచి ముక్కు పిండి ఆశీల్లు వసూలు చేస్తున్న యాజమాన్యం వర్షాల నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు.



ప్రైవేట్ మార్కెట్‌లో చేపలు విక్రయించే చోట బురద

లారీ దగ్ధం



పీఎంపాలెం జాతీయ రహదారిపై గురువారం రాత్రి 11.30 సమయంలో లారీ దగ్ధమైంది. స్థానికుల సహాయంతో లారీ డ్రైవర్, క్లీనర్ మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.